సాక్షి
ఏలూరు

గురువారం । 16 । అక్టోబర్ । 2025



చెకుముకి సైన్స్ సంబరాలు

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాలు పోస్టర్ బుధవారం ఆవిష్కరించారు. ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్నాయి. 10లో ▸



ప్రమాదంలో పురోహితుడు మృతి

పాలకొల్లు – నరసాపురం రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో జిన్నూరుకు చెందిన పురోహితుడు శివకోటి అప్పారావు మృతిచెందారు. 10లో ▸



సౌకర్యాలతో క్యూ కాంప్లెక్స్

శ్రీవారి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా అనివేటి మండపం పక్కన రూ. 12.50 కోట్లతో నూతన క్యూ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు. 10లో ▸

ఫార్మసీ.. ఏదీ అజమాయిషీ?

- మెడికల్ షాపులపై కొరవడిన నిఘా
- నిబంధనలకు నీళ్లొదులుతున్న వ్యాపారులు
- నిషేధిత, గడువు పూర్తయిన మందుల విక్రయాలు
- జీఎస్టీ తగ్గినా పాత స్టాకు పేరిట పాత ధరలకే అమ్మకాలు



సాక్షి, భీమవరం: మందుల షాపులపై అధికారుల అజమాయిషీ కొరవడింది. మత్తు మందులతో పాటు కాలం చెల్లిన వాటిని అమ్ముతూ ప్రజారోగ్యంతో ఆటలాడుతున్న వైనం కొద్దినెలల క్రితం విజిలెన్స్ తనిఖీల్లో వెలుగు చూసింది. తాజాగా మందులపై కేంద్రం జీఎస్టీ తగ్గించినా పలుచోట్ల పాత స్టాకు పేరిట పాత ధరలకే అమ్మకాలు చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో 1600 వరకు రిటైల్, 400 హోల్‌సేల్ మెడికల్ షాపులు ఉన్నాయి. వీటిద్వారా రోజుకు రూ.10 కోట్ల వ్యాపారం జరుగుతున్నట్టు అంచనా. చాలా షాపుల్లో ఫార్మాసిస్టులు లేకుండానే అమ్మకాలు జరిగిపోతున్నాయి. కొందరు బీఫార్మసీ, ఎంఫార్మసీ చేసిన వారితో ఒప్పందం చేసుకుని వారి సర్టిఫికెట్లతో షాపులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గుండె, సుగర్, క్యాన్సర్, న్యూరాలజీ తదితర కొన్ని రకాల వ్యాధులకు సంబంధించిన మందులు, ఫ్లూయిడ్స్, ఇంజక్షన్లు నిర్ణీత ఉష్ణోగ్రతల్లో మాత్రమే నిల్వ చేయాలి. కాగా ఎన్ని షాపుల్లో అందుకు అవసరమైన ఏర్పాట్లు ఉన్నాయనేది ప్రశ్నార్థకమే.

కాలం చెల్లిన, నిషేధిత మందుల విక్రయాలు: పలుషాపుల్లో మత్తు కలిగించేవి, లైంగిక సామర్థ్యం పెంచేవి, గర్భస్రావానికి సంబంధించిన నిషేధిత మందులతో పాటు కాలం చెల్లిన మందుల విక్రయాలు అమ్మకాలు చేస్తున్నారు. కొద్దినెలల క్రితం విజిలెన్స్ అధికారులు తాడేపల్లిగూడెం, తణుకు, అత్తిలి తదితర చోట్ల తనిఖీల్లో ఈ తరహా నిషేధిత, కాలం చెల్లిన మందుల అమ్మకాలు చేస్తున్న విషయం వెలుగుచూసింది. వీటిపై పెద్ద మొత్తంలో లావాదేవీలు జరుగుతున్నట్టు తెలుస్తోంది గడువు పూర్తయిన మందులకు స్టిక్కర్లు అతికించి అమ్మకాలు చేస్తున్నారు. పలు షాపులకు నిషేధిత మందులు సరఫరాపై అధికారులు వివరాలు సేకరించినట్టు అప్పట్లో ప్రచారం జరిగింది. జిల్లాలో ఔషధ నియంత్రణశాఖ అధికారులు ఉన్నా విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగితే తప్ప అక్రమాలు బయటపడకపోవడం గమనార్హం. లైంగిక సామర్థ్యాన్ని పెంచే మందుల వల్ల గుండె, ఊపరితిత్తులపై ప్రభావం పడుతుందని, హార్ట్‌అటాక్ వచ్చే ప్రమాదముందని వైద్యులు చెబుతున్నారు. గర్భస్రావం మందులు ఒక్కోసారి ప్రాణాల మీదుకు తెస్తాయని, మత్తు కలిగించే మందులతో నిద్రలేమి, నరాలకు సంబంధించిన సమస్యలు వస్తాయంటున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



జీఎస్టీ తగ్గిన మేరకు మందులు విక్రయించాలి. ప్రజలకు అవగాహన కల్పిస్తూ జిల్లా వ్యాప్తంగా 30 స్టాళ్లు ఏర్పాటుచేశాం. నిబంధనలు అమలయ్యేలా జిల్లా అంతటా తనిఖీలు చేస్తున్నాం. ఎక్కడైనా అధిక ధరలకు మందులు అమ్మకాలు చేస్తున్నా, నిషేధిత మందులు విక్రయిస్తున్నా ఫిర్యాదులు వస్తే వెంటనే తనిఖీలు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం.

అబిద్ ఆలీషేక్,
జిల్లా డ్రగ్ కంట్రోల్ అధికారి, భీమవరం

జీఎస్టీ తగ్గినా..

మార్కెట్లో ఉన్న వస్తువుల ధరలు పెరగ్గానే తమ వద్ద ఉన్న పాత స్టాకుపై పెరిగిన ధరల స్టిక్కర్లు అతికించి ఆ మేరకు అమ్మకాలు చేసి లాభాలు ఆర్జిస్తుంటారు. ధరలు తగ్గినప్పుడు తమ వద్ద ఉన్న ఓల్డ్ స్టాక్ అయిపోయేవరకు వాటిపై ఉన్న ఎమ్మార్పీ ధరలకే విక్రయిస్తుంటారు. ప్రస్తుతం పలుచోట్ల ఇదే పరిస్థితి కనిపిస్తోంది. వివిధ రకాల మందులు, మెడికల్ గ్రేడ్ ఆక్సిజన్, కళ్లజోళ్లు, వ్యాధి నిర్ధారణ కిట్లుపై 12 శాతం ఉన్న జీఎస్టీని ఏడు శాతం మేర, మెడికల్ థర్మోమీటర్లు, మెడికల్ అనాలసిస్ పరికరాలపై 18 శాతం ఉన్న జీఎస్టీని 13 శాతం వరకు తగ్గించగా, 36 రకాల ప్రాణరక్షక, అరుదైన వ్యాధుల మందులపై 12 శాతం నుంచి 5 శాతం వరకు ఉన్న జీఎస్టీలను పూర్తిగా మినహాయింపునిచ్చారు. మందులపై భారీ తగ్గుదల అంటూ ఊరువాడా ప్రభుత్వం ప్రచారం చేస్తుండగా పాత స్టాకులు ఉండిపోయాయంటూ పలుచోట్ల పాత ధరలకే అమ్మకాలు చేస్తున్నారని వినియోగదారులు అంటున్నారు. ఆర్టెడీ ఎమ్మార్పీపై పది నుంచి 15 శాతం వరకు తగ్గించి ఇవ్వడం ద్వారా జీఎస్టీ కంటే ఎక్కువే తగ్గిస్తున్నామని వ్యాపారులు చెబుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యాలు సొంతంగా ఏర్పాటుచేసుకున్న మందుల షాపులతో పాటు కార్పొరేట్ సంస్థలకు చెందిన మెడికల్ షాపుల్లో చాలాచోట్ల ఇంకా ధరలు దిగిరావడం లేదని తెలుస్తోంది.

నమ్మకం కలిగించాలి

కేరళ డీజీపీ ఆజాద్ చంద్రశేఖర్



కేరళ డీజీపీ రావాడ చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

వీరవాసరం: నిరాడంబర అధికారిగా ఉండటంతో పాటు ప్రజలకు నమ్మకం కలిగించడం పోలీసు బాధ్యత అని కేరళ డీజీపీ రావాడ ఆజాద్ చంద్రశేఖర్ అన్నారు. వీరవాసరానికి చెందిన ఆయనకు బుధవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో పౌర సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా సభలో ఆయన మాట్లాడుతూ తాను ఇదే పాఠశాలలో చదువుకున్నానని, కేరళ డీజీపీగా ఎదగడానికి ప్రధాన కారణం గురువులు, ఊరి ప్రజల ఆశీస్సులే కారణం అన్నారు. ఇదే ఊరిలో తనతో పాటు చదివిన ఎం .సుబ్బారెడ్డి, చికిలే సుధాకర్ ఆలిండియా సర్వీసులకు ఎంపికవడం, వివిధ రాష్ట్రాల్లో అత్యున్నత పదవుల్లో ఉండటంతో వీరవాసరం ఖ్యాతి దేశం మొత్తం తెలిసిందన్నారు. ఏదైనా సాధించాలంటే ఫిజికల్ ఎనర్జీ, మెంటల్ ఎనర్జీ, ఎమోషనల్ ఎనర్జీ, స్పిరిట్యువల్ ఎనర్జీ అనేవి ప్రధానంగా ఉండాలని, ఉన్న సమయాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని అన్నారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ కేరళ డీజీపీగా జిల్లా వాసి ఉండటం గర్వించదగ్గ విషయమన్నారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. జడ్జి వీరవల్లి గోపాలకృష్ణ, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, మహిళా సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్‌పర్సన్ పీతల సుజాత, డీఎస్పీ కూనపరెడ్డి సత్యనారాయణ, రిటైర్డ్ డీఎస్పీ బోను అప్పాజీరావు, డిప్యూటీ కలెక్టర్ మద్దాల సత్యప్రభ, ఎంపీపీ వీరవల్లి దుర్గాభవానీ, సర్పంచ్ చికిలే మంగతాయారు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

జిల్లా కోర్టు ఆవరణలో క్యాంటీన్ ప్రారంభం



జిల్లా కోర్టు ఆవరణలో క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ సురేష్ రెడ్డి

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో నూతనంగా నిర్మించిన క్యాంటీన్ బిల్డింగ్ సముదాయాన్ని హైకోర్టు జడ్జి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ కె.సురేష్‌రెడ్డి, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవితో కలిసి బుధవారం సాయంత్రం ప్రారంభించారు. అనంతరం ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు సీతారాం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి మాట్లాడుతూ 2018 నుంచి ఏలూరు కోర్టు ఆవరణలో క్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ సెక్రటరీ నోముల రాముడు, జాయింట్ సెక్రటరీ ఇబ్రహీం షరీఫ్, కోశాధికారి గండికోట సీతారామరాజు, గద్దె విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు సహకరించాలి



వైట్ కేన్ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు(మెట్రో): సమాజంలో విభిన్న ప్రతిభావంతులు ఆత్మస్థైర్యంతో జీవించేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో బుధవారం జాతీయ వైట్ కేన్ దినోత్సవం సందర్భంగా ర్యాలీని కలెక్టర్ వెట్రిసెల్వి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని వాటి జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామ్ కుమార్, విజువల్లీ చాలెంజెడ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జి.రాధారాణి, ఏలూరు జిల్లా అధ్యక్షుడు జి.డి.వి.ఎస్.వీర భద్రరావు పాల్గొన్నారు.


వేతన బకాయిలు చెల్లించాలంటూ ధర్నా



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆస్పత్రి శానిటేషన్ సిబ్బంది

ఏలూరు (టూటౌన్): జిల్లాలోని వివిధ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బందికి గత 4 నెలలుగా చెల్లించాల్సిన వేతన బకాయిలు, 10 నెలల పీఎఫ్ బకాయిలు చెల్లించాలని కోరుతూ ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు మాట్లాడుతూ ఆస్పత్రుల శానిటేషన్ కాంట్రాక్టర్ ఫస్ట్ ఆబ్జెక్ట్ ఏజెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ జిల్లాలోని అన్ని ఆస్పత్రుల్లో పనిచేసే అవుట్ సోర్సింగ్ సిబ్బందిని ఇబ్బందికి గురి చేస్తుందన్నారు. దీనిపై ప్రభుత్వానికి వినతి పత్రం అందజేసి గత మూడు రోజులుగా సమ్మె చేస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

టీడీపీ నాయకుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు

చాట్రాయి: సీసీ రోడ్ల బిల్లులు దుర్వినియోగం చేశారంటూ స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద కృష్ణారావుపాలెంకి చెందిన టీడీపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కృష్ణారావుపాలెంలో 2017లో వేసిన సీసీ రోడ్లకు నిధులు మంజూరైనప్పటికీ పంచాయతీ కార్యదర్శి దుర్వినియోగం చేశారంటూ బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి తలుపులు వేసి టీడీపీ నాయకులు రామారావు, ధనలక్ష్మి, నరసింహారావు నిరసన వ్యక్తం చేశారు.

జీఎస్టీ తగ్గినా.. దిగిరాని ధరలు



ఏలూరు (మెట్రో): జీఎస్టీ తగ్గించాం.. ధరలు తగ్గాయి కదా అని మార్కెట్‌కు వెళ్తే.. పాత ధరలకే విక్రయాలు చేస్తున్నారు. తాము కొనుగోలు చేసిన ధరలకే స్టాకు ఉన్నంత వరకూ పాత ధరకే విక్రయాలు సాగిస్తామని దుకాణదారులు చెబుతున్నారు. అధికారులు మాత్రం గొప్పలు చెప్పుకుంటూ ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు, ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. నూతన టారిఫ్‌ల ప్రకారం 12 శాతం జీఎస్టీ ఉన్న వస్తువులు 5 శాతంలోకి వెళ్లాయి. ఈ సెక్టార్‌లో వ్యత్యాసం 7 శాతంగా ఉంది. దీన్ని బట్టి రూ.1000 వస్తువు కొనుగోలు చేస్తే రూ.70 తగ్గాలి. వాస్తవానికి ప్రస్తుత మార్కెట్‌లో ఇది ఎక్కడా కనిపించడం లేదు. మందుల ధరల విషయంలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తుంది. అరుదైన వ్యాధుల మందులపై ధరలు తగ్గించారు. సుగర్, బీపీ ట్యాబ్లెట్ల ధరలు తగ్గించినా షాపుల్లో మాత్రం పాత ధరలకే అమ్ముతున్నారు. సామాన్యుడు ఉపయోగించే బియ్యం, గ్యాస్, పప్పు, నూనెల ధరలు అలాగే ఉండడమే కాకుండా పెరిగాయి. జీఎస్టీ తగ్గింపుతో పేదవాడికి ఎంతో మేలు చేకూరుతోందంటూ బస్టాండ్లు, ఆసుపత్రులు, పాఠశాలలు, కార్యాలయాలతో పాటు అన్ని చోట్ల ఊదరగొడుతున్నారు. సెప్టెంబరు 25 నుంచి జీఎస్టీ ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. వీటిని ఈనెల 19 వరకూ నిర్వహించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. తగ్గిన ధరలకు విక్రయాలు చేయాలంటూ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు తప్ప ఏ ఒక్కరిపైనా పాత ధరలకు విక్రయిస్తున్నారని ఒక్క కేసును సైతం నమోదు చేసిన పాపాన పోలేదు. ఈ నెల 13 నుంచి హేలాపురి ఉత్సవాల పేరుతో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ వేడుకలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఆక్వా చెరువుల రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి



కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): కలెక్టరేటు గోదావరి సమావేశ మందిరంలో బుధవారం రాష్ట్ర ఆక్వాకల్చర్ అభివృద్ధి అథారిటీ యాక్ట్ మేరకు ఆక్వా చెరువుల అప్సడా రిజిస్ట్రేషన్ల ప్రక్రియపై సంబంధిత అధికారులతో కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆక్వా సాగులో ఉన్న పది మండలాల్లో గ్రామాల వారీగా సమీక్షించారు. కనీసం 50 శాతం పూర్తి చేయలేక పోయారని కలెక్టరు అసహనం వ్యక్తం చేశారు. టార్గెట్ పూర్తి చేయని అధికారులు, అసిస్టెంట్లను సస్పెండ్ చేస్తానని కలెక్టరు హెచ్చరించారు. కలెక్టరు మాట్లాడుతూ మొత్తం పది మండలాల్లో 1,49,828 ఎకరాలు ఉండగా ఇంతవరకూ 52,613 ఎకరాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తయిందని, మిగతా త్వరగా పూర్తి చేయాలన్నారు. కొల్లేరు భూములు వైల్డ్ లైఫ్ పరిధిలో ఉన్నాయని వాటిని లైసెన్స్ ఇవ్వరాదన్నారు. సమావేశంలో విజయవాడ మత్స్యశాఖ కమిషరు కార్యాలయం జాయింటు డైరెక్టరు షేక్ లాల్ మహమ్మద్, జిల్లా మత్స్యశాఖ డీడీ బి.నర్సయ్య, సహాయ సంచాలకులు బి.రాజ్‌కుమార్, కె.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

హేలాపురి ఉత్సవం సందర్శన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ ద్వారా తీసుకువచ్చిన సంస్కరణలతో నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలు ప్రతినెల కొంత ఆదాయం పొందుతాయని కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. స్థానిక సీఆర్ రెడ్డి కళాశాల ప్రాంగణంలో బుధవారం సాయంత్రం పండుగ వాతావరణంలో జరిగిన హేలాపురి ఉత్సవం గ్రాండ్ షాపింగ్ ఫెస్టివల్‌ను కలెక్టర్ సందర్శించారు.

విద్యుత్ సంస్థలో పదోన్నతులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు, భీమవరం ఆపరేషన్ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న పలువురు జూనియర్ అక్కౌంట్స్ ఆఫీసర్లకు పదోన్నతులు కల్పిస్తూ ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఏలూరు సర్కిల్ పరిధిలోని జంగారెడ్డిగూడెం ఓడీలో జేఏఓగా పని చేస్తున్న ఎస్.గౌరీనాథ్‌ను అసిస్టెంట్ అక్కౌంట్స్ ఆఫీసర్‌గా పదోన్నతి కల్పించి పెద్దాపురం విద్యుత్ రెవెన్యూ కార్యాలయానికి బదిలీ చేశారు. భీమవరం సర్కిల్ పరిధిలోని భీమవరం విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో జేఏఓగా పని చేస్తున్న జీవీవీఎస్ఎల్ సూర్యకుమారికి ఏఏఓగా పదోన్నతి కల్పిస్తూ తాడేపల్లిగూడెం విద్యుత్ రెవెన్యూ కార్యాలయానికి బదిలీ చేశారు. పాలకొల్లు విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో జేఏఓగా పని చేస్తున్న హరిప్రియకు ఏఏఓగా పదోన్నతి కల్పిస్తూ అదే కార్యాలయంలో పోస్టింగ్ ఇచ్చారు.

మోదీ రాష్ట్రాభివృద్ధికి ఏం చేశారు?

ఆకివీడు: రాష్ట్ర పర్యటనకు వస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రాభివృద్ధికి ఏం చేస్తారో చెప్పాలని, రాష్ట్రంలోని కూటమి నాయకులు మోదీని పొగడడం కాకుండా రాష్ట్రానికి నిధులు అడగాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాల వల్ల రాష్ట్రంలో ఆక్వా సాగుపై తీవ్ర ప్రభావం చూపుతోందని ప్రధానంగా గోదావరి జిల్లాల్లో ఆక్వా రైతులకు, వ్యవసాయ రైతులకు నష్టం వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. జీఎస్టీతో ఇప్పటికే రూ.60 లక్షల కోట్లు ముక్కుపిండి వసూలు చేశారని జీఎస్టీ తగ్గింపంటూ సంబరాలు చేసుకోవడం ఎంతవరకు సబబని మండిపడ్డారు. రాష్ట్రానికి ప్రధాని ఎప్పుడూ ఒట్టి చేతులతోనే వస్తున్నారని ఈ పర్యటనలోనైనా నిధులు కేటాయింపుపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డు మీద రోడ్డు వేసేయ్!

నూజివీడు మున్సిపాలిటీలో ప్రజాధనం వృథా



పట్టణంలో మీ సేవా కేంద్రం నుంచి సీపీఎం ఆఫీసు వరకు ప్రస్తుతం ఉన్న సిమెంట్ రోడ్డు

నూజివీడు: ప్రభుత్వం ఖర్చుచేసే ప్రతి రూపాయి వృథా కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై, అధికారులపై ఉంది. నూజివీడు మున్సిపాలిటీలో అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా చేసేస్తున్నారు. పట్టణంలోని శివారు ప్రాంతాల్లో అభివృద్ధి చేయాల్సిన మట్టిరోడ్లు ఎన్నో ఉన్నప్పటికీ వాటినన్నింటిని వదిలేసి బాగున్న రోడ్డుపైనే మళ్లీ సిమెంట్ రోడ్డు వేసేందుకు మున్సిపాలిటీ ఇంజినీరింగ్ విభాగం సన్నద్ధమైంది. దీంతో బాగున్న రోడ్డుపై రోడ్డు వేయడం నూజివీడు మున్సిపాలిటీలోనే సాధ్యమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిలో భాగంగా ఇంజినీరింగ్ అధికారులు టెండర్లు పిలిచి పని చేసేందుకు కాంట్రాక్టర్‌ను సైతం నిర్ణయించగా దానికి మున్సిపల్ కౌన్సిల్ తందాన అంటూ ఆమోదం తెలపడం గమనార్హం. దీంతో రూ.7.35 లక్షల ప్రజాధనం వృథా కానుంది. పట్టణంలోని పాత మీసేవా కేంద్రం వద్ద నుంచి సీపీఎం కార్యాలయం వరకు సీసీ రోడ్డు నిర్మించడానికి మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు రూ.7.75 లక్షల అంచనా విలువతో టెండర్లు పిలిచారు. దీనికి 5.24 శాతం లెస్‌తో టెండర్ వేసిన కాంట్రాక్టర్‌కు వర్కు దక్కింది.

పాత మీసేవా కేంద్రం వద్ద నుంచి సీపీఎం ఆఫీసు మీదుగా రైతుబజారు రోడ్డు వరకు అల్రెడీ సిమెంట్ రోడ్డు ఉంది. ఈ రోడ్డు బాగానే ఉన్నప్పటికీ దీనిపై మళ్లీ రోడ్డు వేయడాన్ని ప్రజలు తప్పుపడుతున్నారు. ఈ రోడ్డు భారీ వాహనాలు రాకపోకలు సాగించడానికి కుదరదు. రోడ్డు బాగున్నప్పటికీ సిమెంట్ రోడ్డు వేయడానికి సిద్ధం చేయడం దారుణం. శివారు ప్రాంతాలైన ఉషాబాలానగర్, నందనం తోట, ఎమ్మార్ అప్పారావు కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, రోటరీ ఆడిటోరియం ప్రాంతాల్లో పదుల సంఖ్యలో మట్టిరోడ్లు ఉన్నాయి. అధిక మొత్తంలో మున్సిపాలిటీకి ఆస్తిపన్ను వచ్చే రోటరీ ఆడిటోరియం ఏరియాలో రోడ్ల అభివృద్ధి చేయాల్సి ఉంది. వాటిని వదిలేసి ఏరియా కౌన్సిలర్ చెప్పారంటూ రోడ్డుపై రోడ్డు వేయడానికి ప్రజాధనాన్ని వృథా చేస్తుండటం గమనార్హం.

ప్రశ్నించే గొంతుపై ఉక్కుపాదం

- కేసుల పేరుతో కొనసాగుతున్న వేధింపుల పర్వం
- ఈ ఏడాది సాక్షి కార్యాలయం వద్ద కూటమి నేతల వరుస ఆందోళనలు
- ఆఫీసుకు నిప్పంటించిన వైనం
- వ్యతిరేక కథనాలు రాస్తే వేధింపుల పరంపర



ఏలూరు సాక్షి కార్యాలయంలో కంప్యూటర్లను ధ్వంసం చేసిన ఎమ్మెల్యే చింతమనేని అనుచరులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ప్రజల గొంతుగా నిలిచి ప్రశ్నిస్తే ప్రభుత్వానికి నచ్చదు.. ప్రతిపక్ష పాత్రలో ప్రభుత్వ వైఫల్యాలను కూటమి అరాచకాలను వెలుగులోకి తెస్తే వేధింపులకు తెగబడుతున్నారు. కూటమి కొలువుదీరిన తరువాత వేధింపుల్లో జర్నలిస్టులు కూడా బలవుతున్నారు. తరుచూ కేసులు, దాడులు, దౌర్జన్యాలకు గురై హక్కుల కోసం నినదిస్తున్నా స్పందించని పరిస్థితి. ఈ ఏడాది కాలంలో పశ్చిమగోదావరి జిల్లాలో వరుస మూడు సంఘటనలు జరిగాయి. ఏలూరు సాక్షి కార్యాలయానికి నిప్పు పెట్టడం మొదలుకొని కార్యాలయం వద్ద యూనిట్ కార్యాలయం వద్ద నిరసన పేరుతో కూటమి నేతలు అలజడి సృష్టించారు. తాజాగా నెల్లూరు ఎడిషన్‌లో ప్రచురితమైన వార్తపై వేధింపులకు శ్రీకారం చుట్టారు. విజయవాడ ఆటోనగర్‌లోని సాక్షి కార్యాలయం వద్ద, హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయం వద్ద పోలీసులు హడావుడి చేసి నోటీసులు ఇవ్వాలంటూ హంగామా చేస్తున్నారు. గతంలో జిల్లాలో కూటమి నేతల మట్టి మాఫియాపై వరుస కథనాలు, మట్టి మాఫియాలో బలైన బాధితుల వివరాలతో స్పాట్ కథనాలు ప్రచురించడంపై కూటమి నేతలు తారాస్థాయిలో మండిపడ్డారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అనుచరగణంతో సాక్షి కార్యాలయం వద్దకు వచ్చి హడావుడి సృష్టించి మూడు గంటల పాటు కార్యాలయం వద్దనే వందలాది మందితో బైఠాయించారు. కొంతమంది అనుచరులు కార్యాలయంలోకి ప్రవేశించి ఫర్నీచర్ ధ్వంసం చేశారు.



ఏలూరు సాక్షి కార్యాలయం ఎదురుగా ఫ్లకార్డులు తగలబెడుతున్న టీడీపీ మహిళా కార్యకర్తలు (ఫైల్)



సాక్షి కార్యాలయం వద్ద టీడీపీ మూకలు తగలపెట్టిన ఫర్నీచర్ (ఫైల్)

జూన్ మొదటివారంలో రాష్ట్ర వ్యాప్తంగా సాక్షి కార్యాలయాలపై టీడీపీ శ్రేణులు ప్రత్యక్ష దాడులకు తెగబడ్డారు. అన్ని యూనిట్ కార్యాలయాల వద్ద టీడీపీ శ్రేణులు వీరంగం సృష్టించడం, కార్యాలయ ప్రధాన ద్వారం వద్ద నేమ్ బోర్డులు తొలగించడం వంటి ఘటనలకు పాల్పడ్డారు. తాడేపల్లిగూడెం యూనిట్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి సాక్షి పత్రిక ప్రతులను దగ్ధం చేశారు. జూన్ 10న ఏలూరులోని సాక్షి కార్యాలయం వద్ద ఆందోళన ముసుగులో కార్యాలయం కింద భాగంలో ఉండే ఫర్నీచర్‌కు పెట్రోలు పోసి నిప్పంటించారు. ప్రశ్నించినప్పుడల్లా దాడులకు పాల్పడుతూనే ఉన్నారు.

సోషల్ మీడియా పోస్టులపైనా కేసులు

సోషల్ మీడియాపైనా వేధింపుల పర్వం కొనసాగుతూనే ఉంది. ఉమ్మడి జిల్లాలో ఎవరైనా వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలు ప్రభుత్వ వైఫల్యాలపై పోస్టులు పెడితే కేసుల పేరుతో హోరెత్తించారు. తణుకు మొదలుకొని నూజివీడు వరకు అనేక నియోజకవర్గాల్లో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే మొదలైన కేసుల పరంపర కొన్నిచోట్ల నేటికీ కొనసాగుతూనే ఉంది. భీమడోలు, తణుకు, భీమవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, ఉంగుటూరు, కైకలూరు ఇలా అనేక ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి.

క్లుప్తంగా

రేషన్ సరఫరా అవకతవకలపై విచారణ


రేషన్ డిపోలో రికార్డులను పరిశీలిస్తున్న సివిల్ సప్లయిస్ డీటీ అన్నపూర్ణ

తాడేపల్లిగూడెం రూరల్: దండగర్ర రేషన్ డిపోలో రేషన్ సరఫరాలో అవకతవకలపై బుధవారం అధికారులు విచారణ చేపట్టారు. దండగర్ర రేషన్ డిపో నిర్వాహకుడు చిక్కాల అంబేడ్కర్ రేషన్ సక్రమంగా పంపిణీ చేయడం లేదని, అవకతవకలకు పాల్పడుతున్నాడని కార్డుదారుల నుంచి వచ్చిన ఆరోపణల నేపథ్యంలో తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్ ఆదేశాల మేరకు సివిల్ సప్లయిస్ డీటీ అన్నపూర్ణ విచారణ చేశారు. రేషన్ డిపో వద్ద స్టాకు బోర్డు లేకపోవడం, కార్డుదారుల ఫిర్యాదుల మేరకు రేషన్‌డీలర్‌పై కేసు నమోదు చేస్తామని డీటీ అన్నపూర్ణ తెలిపారు. రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడితే అధికారులకు సమాచారం ఇవ్వాలని, వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక


పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

తణుకు అర్బన్: పశ్చిమగోదావరి జిల్లా ఆర్ఎస్ఎఫ్ఐ, ఏపీఆర్ఎస్ఏ రోలర్ స్కేటింగ్ హాకీ క్వాడ్, కేడెడ్ (అండర్ 12), సబ్ జూనియర్స్ (అండర్ 15) ఎంపికలు బుధవారం తణుకు మాంటిస్సోరీ స్కూలు రింక్‌లో నిర్వహించారు. ఈ ఎంపికల్లో 7గురు కేడెడ్ బాలురు, సబ్ జూనియర్ బాలురు 8 మంది ఎంపికైనట్లు అబ్దుర్ షేక్ ఖాసిం తెలిపారు. సానబోయిన స్నేహశ్రీ ఓపెన్ కేటగిరీలో ఎంపికైంది. వీరంతా వచ్చేనెల 2 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరవుతారని వివరించారు. ఈ సందర్భంగా స్కూలు డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు విద్యార్థులకు శిక్షణనిచ్చిన కోచ్ అరెకపూడి భార్గవ్‌ను అభినందించారు.

కిల్కారి సేవలను వినియోగించుకోవాలి

వీరవాసరం: కిల్కారి సేవల (చిన్నారి చిరునవ్వు)ను గర్భిణులు, బాలింతలు వినియోగించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ గీత బాయ్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆశ నోడల్ ఆఫీసర్స్ మీటింగ్‌లో కిల్కారి సేవలపై ఆమె సమీక్ష నిర్వహించారు. కిల్కారి కాల్ ద్వారా వచ్చే ప్రతి సమాచారాన్ని గర్భిణులు, బాలింతలు పూర్తిగా వినేటట్లు చేయాలన్నారు. మాతా శిశు మరణాలు తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ కిల్కారి కాల్ సర్వీస్‌ని ప్రవేశపెట్టినట్లు చెప్పారు. గర్భిణీ అయినా 4 వ నెల మొదలు పుట్టిన బిడ్డకు ఏడాది వయసు వచ్చే వరకు కిల్కారి కాల్స్ వస్తాయని, తద్వారా తల్లీ బిడ్డల ఆరోగ్య క్షేమ సమాచారాన్ని అందజేస్తుందన్నారు. ఆశ నోడల్ ఆఫీసర్లు గర్భిణీలు, బాలింతలకు కిల్కారి సేవలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజషన్ అధికారిణి డాక్టర్ సుధా లక్ష్మి, డీపీహెచ్ఎన్ఓ వెంకట్‌రత్నం, డీసీఎం ఎస్.వెంకటస్వామి, కిల్కారి రీజనల్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.రాజు పాల్గొన్నారు.

శ్రీహరి చెంత.. సౌకర్యాలతో క్యూ కాంప్లెక్స్

- భక్తుల సౌకర్యార్థం రూ. 12.50 కోట్లతో నిర్మిస్తున్న శాశ్వత క్యూ కాంప్లెక్స్
- తుది దశకు చేరుకున్న పనులు
- కాంప్లెక్స్‌లో మొత్తం 6 కంపార్ట్‌మెంట్‌లు నిర్మాణం
- ప్రతి దాంట్లో స్టీల్ బల్లలు, స్క్రీన్, సౌండ్ సిస్టమ్, సీసీ కెమెరాలు, ఫ్యాన్ల ఏర్పాటు


నిర్మాణంలో ఉన్న క్యూ కాంప్లెక్స్


క్యూ కాంప్లెక్స్ పక్క నుంచి ఏర్పాటు చేసిన స్టీల్ క్యూలైన్లు


సీసీ కెమెరాలను అమర్చుతున్న సిబ్బంది

ద్వారకాతిరుమల: శ్రీవారి దర్శనానికి వెళ్లే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా.. అన్ని హంగులతో, ఆలయ అనివేటి మండపం పక్కన నూతన క్యూ కాంప్లెక్స్‌ను నిర్మిస్తున్నారు. రూ. 12.50 కోట్లతో జరుగుతున్న ఈ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. మొత్తం ఈ క్యూ కాంప్లెక్స్‌లో 6 కంపార్ట్‌మెంట్లను నిర్మించారు. ఒక్కో కంపార్ట్‌మెంట్‌లో 250 మంది భక్తులు కూర్చునేందుకు వీలుగా స్టీల్ బల్లలను ఏర్పాటు చేశారు. అలాగే ప్రతి కంపార్ట్‌మెంట్‌లో ఒక డిజిటల్ స్క్రీన్, సెంట్రలైజ్డ్ సౌండ్ సిస్టమ్‌తో పాటు, 5 సీసీ కెమెరాలను అమర్చారు. ఒక్కో దాంట్లో ప్రత్యేకంగా ఒక హై వాల్యూమ్–లో స్పీడ్ (హెచ్‌వీఎల్ఎస్) సీలింగ్ ఫ్యాన్‌ను, అలాగే 12 చిన్న సీలింగ్ ఫ్యాన్లను అమర్చారు. క్యూ కాంప్లెక్స్ పక్కనే మరుగుదొడ్లను నిర్మించారు. వాటిలోకి వెళ్లేందుకు వీలుగా ప్రతి కంపార్ట్‌మెంట్‌లో ఒక ఎగ్జిట్ మార్గాన్ని ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే మొత్తం 6 కంపార్ట్‌మెంట్లలో ఒకటి రూ. 200 టికెట్లు పొందిన భక్తులకు, మరొకటి రూ.100 టికెట్లు పొందిన వారికి, మిగిలిన నాలుగు కంపార్ట్‌మెంట్లను ఉచిత దర్శనం భక్తులకు కేటాయించనున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ క్యూ కాంప్లెక్స్ భక్తులకు అందుబాటులోకి రానుంది. అయితే క్యూ కాంప్లెక్స్ నుంచి ఆలయంలోకి వెళ్లే క్యూ లైన్లను భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేస్తే సరిపోతుంది.

హెచ్‌వీఎల్ఎస్ ఫ్యాన్లు ప్రత్యేకం

ప్రతి కంపార్ట్‌మెంట్‌లో ఒకటి ఏర్పాటు చేసిన హెచ్‌వీఎల్ఎస్ సీలింగ్ ఫ్యాన్ ప్రత్యేక ఆకర్షణగా, భక్తులకు సౌకర్యవంతంగా నిలవనుంది. ఒక సాధారణ సీలింగ్ ఫ్యాన్‌తో పోలిస్తే 10 రెట్లు దూరాన్ని ఈ పెద్ద ఫ్యాన్ కవర్ చేస్తుంది. ఎక్కువగా వీటిని పరిశ్రమలు, ఎయిర్‌పోర్ట్‌లు, అతి పెద్ద ఫంక్షన్ హాల్స్‌లలో వినియోగిస్తున్నారు. వీటి వల్ల విద్యుత్ కూడా ఆదా అవుతుంది. మెయింటెనెన్స్ కూడా ఉండదని అధికారులు చెబుతున్నారు. తక్కువ స్పీడ్‌లో తిరుగుతూ.. ఎక్కువ గాలి ఇవ్వడం వీటి ప్రత్యేకత. అందుకే వీటిని ఏర్పాటు చేశారు.


క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన స్క్రీన్, స్టీల్ బల్లలు


రెండు కంపార్ట్‌మెంట్‌ల మధ్య ఉన్న డోర్

ప్రత్యేక భద్రత కోసం..

శని, ఆదివారాలు, ఇతర పర్వదినాల్లో వేలాది మంది భక్తులు శ్రీవారిని దర్శిస్తుంటారు. వారికి సీసీ కెమెరాల ద్వారా జేబుదొంగల నుంచి ఇప్పటికే రక్షణ కల్పిస్తున్నారు. భక్తులకు మరింత భద్రత కల్పించేందుకు నూతన క్యూ కాంప్లెక్స్‌లోని ఒక్కో కంపార్ట్‌మెంట్‌లో 5 సీసీ కెమెరాలను, అలాగే స్వామివారి సేవల వివరాలు, దర్శనం వేళలను తెలియజేసేందుకు ఈ డిజిటల్ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు.


కంపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన హెచ్‌వీఎల్ఎస్ సీలింగ్ ఫ్యాన్

క్షేత్ర రహదారికి మరమ్మతులంటూ.. మాయ

రోడ్డుపై గోతులు పూడ్చకుండా మార్జిన్ శుభ్రం చేసిన వైనం

ద్వారకాతిరుమల: భీమడోలు–ద్వారకాతిరుమల క్షేత్ర ప్రధాన రహదారికి మరమ్మతులంటూ.. కొందరు మాయ చేస్తున్నారు. లక్ష్మీపురంలోని విర్డ్ ఆస్పత్రి సమీపంలో రోడ్డు మార్జిన్‌ను బుధవారం ఆర్అండ్‌బీ అధికారులు శుభ్రం చేయగా, కొందరు కూటమి నాయకులు రోడ్డుకు మరమ్మతు పనులు ప్రారంభం అయ్యాయంటూ ప్రచారానికి తెర తీశారు. అయితే రోడ్డుపై ఉన్న గోతులను పూడ్చకుండా ఇలా మార్జిన్‌లలోని మట్టిని, చెత్తను పక్కకు నెడితే ఉపయోగం ఏమిటని, వీటిని మరమ్మతులని ఎలా అంటారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పంగిడిగూడెం, సూర్యచంద్రరావుపేట, గొల్లగూడెం, లక్ష్మీపురం విర్డ్ ఆస్పత్రి వద్ద, ద్వారకాతిరుమలలోని నిమ్మకాయల మార్కెట్ యార్డు ఎదురుగా రోడ్డుపై ప్రమాదాలకు నిలయమైన గోతులను పూడ్చి, పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయాలని భక్తులు, ప్రయాణికులు కోరుతున్నారు.


విర్డ్ ఆస్పత్రి సమీపంలో రోడ్డు మార్జిన్‌లోని మట్టిని, చెత్తను జేసీబీతో పక్కకు నెడుతున్న దృశ్యం

వరకట్న వేధింపుల కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు స్టేషన్ రైటర్ పి.బాబూరావు తెలిపారు. పట్టణంలోని దళితవాడకు చెందిన ఉండ్రాజవరపు సౌజన్యకు, లింగపాలెం మండలం పాశ్చానగరానికి చెందిన అబ్బదాసరి రాజశేఖర్‌కు 2023 నవంబర్‌లో వివాహమైంది. వివాహ సమయంలో రూ.3.20 లక్షలు, 6 గ్రాముల బంగారం, సారె సామగ్రి కట్నంగా ఇచ్చారు. అనంతరం వీరికి ఒక పాప పుట్టింది. అయితే భర్త, అత్తమామలు దుర్భాషలాడుతూ, తనను పనిమనిషిలా చూస్తూ అధిక కట్నం కోసం వేధిస్తున్నారని సౌజన్య ఫిర్యాదు చేసింది. విషయం తెలుసుకున్న సౌజన్య తండ్రి ఆమెను పుట్టింటికి తీసుకువెళ్లగా, మూడు నెలలు గడిచినా భర్త కాపురానికి తీసుకువెళ్లలేదు. దీంతో ఆమె పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

అరుదైన కవల దూడల జననం

కొయ్యలగూడెం: ఓ ఆవు అరుదైన కవల దూడలకు జన్మనిచ్చింది. కొయ్యలగూడెంలోని మట్టా మురళీకృష్ణకి చెందిన శంకర జాతికి (హెచ్ఆర్) చెందిన ఆవు కవల దూడలకు జన్మనివ్వగా ఇందులో ఒకటి దున్న, మరొకటి పెయ్య దూడలు ఉన్నాయి. ఆవును ప్రసవానికి తీసుకువచ్చిన వేళలో కవలదూడలు ఉన్నట్లుగా అనుమానించామని, అయితే సాధారణ ప్రసవానికి లేదా శస్త్ర చికిత్సకు వీలుకాకుండా ఉన్నట్లు పశు వైద్య శాఖ అధికారి బీఆర్ శ్రీనివాస్ తెలిపారు. దీంతో హైడ్రాలిక్ ట్రాక్టర్‌ను తీసుకువచ్చి ఆవును తలకిందులుగా వేలాడ తీసి కడుపులో ఉండగానే దూడలను సరి చేశామన్నారు. అనంతరం ప్రసవించడానికి చికిత్స అందించగా కవల దూడలు జన్మించాయన్నారు. ఈ విధానాన్ని శాస్త్రీయంగా ఫ్రీమార్టినిజం అంటారని తెలిపారు. ఈ విధానంలో జన్మించిన దూడల్లో పెయ్య దూడ ప్రాణానికి హాని ఉంటుందని, కానీ రెండు కూడా సంపూర్ణ ఆరోగ్యంతో ఉండటం విశేషం అని చెప్పారు. సిబ్బంది కళింగి నరేష్, కె సతీష్, నరసింహమూర్తి, కార్యాలయ సహాయకుడు కె వెంకట్రావు సహకరించారన్నారు.


కొయ్యలగూడెంలో జన్మించిన కవల దూడలు

కోర్టు ఉత్తర్వులు భేఖాతర్

రైతు భూమి ఆక్రమణకు దౌర్జన్యం

కొయ్యలగూడెం: కోర్టు ఉత్తర్వులను సైతం భేఖాతర్ చేస్తూ కొందరు వ్యక్తులు ఓ రైతుకు చెందిన భూమిని ఆక్రమించుకోవడం వివాదాస్పదమైంది. రాజవరం, తిరుమలాపురం గ్రామాల సరిహద్దులో 595/1 594/2 సర్వే నంబర్లకు సంబంధించిన భూమి బుధవారం వివాదాస్పదంగా మారింది. రాజవరానికి చెందిన రైతు దాసరి విష్ణు పేర్కొన్న వివరాల ప్రకారం గత 20 ఏళ్లుగా వివాదంలో ఉన్న సుమారు 10 ఎకరాల భూమి విషయంపై 2024వ సంవత్సరం కోర్టులో తనకు అనుకూలంగా తీర్పు వెలువడిందని అన్నారు. ఇందుకు సంబంధించి పోలీసు ప్రొటెక్షన్‌తో డెలివరీ ఆర్డర్ కూడా తీసుకున్నట్లు చెప్పారు. దానికి సంబంధించి ఆక్రమణలకు పాల్పడుతున్న వ్యక్తులకు కోర్టు స్టేఆర్డర్ ఇవ్వనప్పటికీ తన పొలంలోకి వచ్చి తరచూ దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో దీనిపై పోలీసులను ఆశ్రయిస్తే నిబంధనలకు విరుద్ధంగా మళ్లీ ప్రొటెక్షన్ ఆర్డర్స్ అడుగుతున్నారని అన్నారు. గతంలోనే తాము పోలీసు ప్రొటెక్షన్‌తో కూడిన డెలివరీ ఆర్డర్స్ అందజేసినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. దీన్ని అలుసుగా తీసుకొని ఆక్రమణదారులు పేట్రేగిపోయారని గత మార్చి నెలలో దౌర్జన్యంగా తన పొలంలోకి ప్రవేశించడమే కాకుండా పంటను తరలించుకుపోయారన్నారు. దీనిపై హైకోర్టును ఆశ్రయించగా తనపై దౌర్జన్యం చేసి తన పొలాన్ని ఆక్రమించుకోవాలని చూస్తున్న వారికి కోర్టు ధిక్కారణ నోటీసులు కూడా జారీ చేసిందన్నారు. నేర చరిత్ర కలిగినటువంటి రాజకీయ నాయకుల అండదండలతో తన పొలాన్ని ఆక్రమించుకోవడానికి ఇరువురు వ్యక్తులు అరాచకాలు సృష్టిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే ఒక సామాజిక వర్గానికి చెందిన కొందరిని అడ్డం పెట్టుకొని, అలాగే కొందరు నేరచరిత్ర కలిగిన కిరాయి వ్యక్తులను వెంటపెట్టుకొని బుధవారం తన పొలంలోకి వచ్చి దౌర్జన్యానికి పాల్పడ్డారని చెప్పారు. వ్యవసాయ అభివృద్ధికి సంబంధించిన పనులు కొనసాగుతుండగా వాటిని అడ్డుకొని కూలీలపై దౌర్జన్యం చేశారని, పనులు నిర్వహించకుండా ఆటంకం కలిగించారని ఆరోపించారు. కోర్టు ఆర్డర్స్‌ని సైతం ధిక్కరిస్తూ తన భూమిని కాజేయడానికి సదరు వ్యక్తులు అరాచకాలకు పాల్పడుతున్నారని, దీనిపై ప్రభుత్వం స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.


పొలంలో ఘర్షణకు పాల్పడుతున్న దృశ్యం

పోలీస్ గ్రౌండ్‌లో టెన్నిస్ కోర్టు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో పోలీసులకు శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసానికి దోహదపడేలా పోలీస్ అధికారులు, సిబ్బంది ఎంతో శ్రమించి ఆహ్లాదకరమైన టెన్నిస్ కోర్టును ఏర్పాటు చేయటం అభినందనీయమని ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. బుధవారం రాత్రి ఆయన టెన్నిస్ కోర్టును ప్రారంభించారు. కొద్దిసేపు పోలీస్ సిబ్బందితో కలిసి ఆయన టెన్నిస్ ప్రాక్టీస్ చేశారు. ఎంతో కష్టపడి టెన్నిస్ కోర్టును నిర్మించారనీ, పోలీస్ సిబ్బంది సంక్షేమానికి తాము అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. టెన్నిస్ కోర్టు నిర్మాణంలో ... ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు పర్యవేక్షణలో ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఎస్బీ సీఐ మల్లేశ్వరరావు, ఆర్ఐ జీఎస్‌పీబీ కుమార్, ఆర్ఎస్ఐ కే.వెంకటేష్, ఆర్ఎస్ఐ ఎం.భాస్కరరావు, ఆర్ఎస్ఐ అమలేశ్వరరావు, ఏఎస్ఎస్ కానిస్టేబుల్ వీ.వరప్రసాద్ ఆధ్వర్యంలో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ బీ.సుగుణరావు, కానిస్టేబుల్ కే.సూర్యచంద్రరావు, పీవీ రమణరావు, టీ.ప్రతాప్, ఎం.మురళీకృష్ణ, హోంగార్డులు జీ.చిన్ని, కే.శ్రీకాంత్, కే.సాయికుమార్, సీహెచ్ చింతయ్య, వీ.చంద్రతేజ కీలకపాత్ర పోషించారు. వీరందరినీ ఎస్పీ శివకిషోర్ అభినందించారు.


శ్రమదానం చేసిన నిర్మించిన టెన్నిస్ కోర్టును ప్రారంభించిన ఎస్పీ శివకిషోర్, పోలీస్ అధికారులు

సినీ ఫక్కీలో చోరీ

స్కూటీ డిక్కీలోని బంగారం, నగదు అపహరణ

భీమడోలు: గుండుగొలనులో బుధవారం మధ్యాహ్నం సినీ ఫక్కీలో చోరీ జరిగింది. స్కూటీ డిక్కీలో ఉన్న సుమారు రూ.14 లక్షలు విలువ చేసే బంగారం, నగదు అపహరణకు గురయ్యాయి. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెనుగంటి బుజ్జి అనే వ్యక్తి యూనియన్ బ్యాంకు నుంచి తాకట్టు పెట్టిన 8 కాసుల బంగారు అభరణాలు, రూ.4 లక్షల నగదును విత్ డ్రా చేసుకున్నాడు. తన స్కూటీలోని డిక్కీలో వాటిని పెట్టుకుని బయలుదేరాడు. మార్గమధ్యలోని ఓ కర్రీ పాయింట్ వద్ద ఆగి దుకాణంలోకి వెళ్లాడు. తిరిగి స్కూటీ వద్దకు వచ్చేసరికి అందులోని నగదు, బంగారం అపహరణకు గురయ్యాయి. స్కూటీ డిక్కీకి తాళం లేకపోవడంతో సులువుగా ఈ చోరీ జరిగినట్లు తెలిసింది. బాధితుడిని నుంచి సమాచారం అందుకున్న భీమడోలు సీఐ యూజే విల్సన్, ఎస్సై వై.సుధాకర్ విచారణ చేపట్టారు. గ్రామంలోని సీసీ పుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

బాణసంచా అక్రమంగా నిల్వ చేసిన వ్యక్తి అరెస్ట్

ఆగిరిపల్లి : బాణసంచా అక్రమంగా నిల్వచేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం మండలంలోని వట్టిగుడిపాడులో ఎస్సై శుభ శేఖర్ తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. గ్రామానికి చెందిన జ్యోతి దానకర్ణ అనే వ్యక్తి ఎటువంటి లైసెన్స్ లేకుండా అక్రమంగా ఇంటిలో నిల్వచేసిన రూ.50 వేల విలువైన బాణ సంచాను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేశారు.

22న ఎస్ఆర్‌కేఆర్‌లో జిల్లాస్థాయి యూత్ ఫెస్టివల్

భీమవరం: భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 22వ తేదీన డిస్ట్రిక్ట్ యూత్ ఫెస్టివల్ సందర్భంగా జిల్లాస్థాయి ఎగ్జిబిషన్ ఆఫ్ సైన్స్ మేళా, సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు, సెట్విల్ సీఈఓ కేఎస్ ప్రభాకరరావు తెలిపారు. బుధవారం కళాశాల మేనేజ్‌మెంట్ మీటింగ్ హాల్‌లో సైన్స్ మేళా, సైన్స్ ఎగ్జిబిషన్ పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్లు ఎన్ గోపాలకృష్ణమూర్తి, ఎం సురేష్‌బాబు మాట్లాడుతూ సైన్స్ ఎగ్జిబిషన్‌లో బహుమతులు పొందిన ప్రాజెక్టులను అమరావతిలో జరిగే రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తారన్నారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్ రంగరాజు, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సీహెచ్ దిలీప్ చక్రవర్తి, సెట్విల్ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పురోహితుడు మృతి



పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని పాలకొల్లు – నరసాపురం రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాల ప్రకారం పోడూరు మండలం జిన్నూరు గ్రామానికి చెందిన శివకోటి అప్పారావు (65) బుధవారం తన ద్విచక్ర వాహనంపై నరసాపురం వెళ్లి పాలకొల్లు వస్తుండగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోకి వచ్చే సరికి వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అప్పారావు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద ఆయన పూజా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అప్పారావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు శివకోటి బాల సుబ్రహ్మణ్యం ఫిర్యాదు మేరకు ఎస్సై జీజే ప్రసాద్ కేసు నమోదు చేశారు.

ఉద్యోగ విరమణ వయసు పంచాయితీ మళ్లీ వాయిదా

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో పనిచేసే ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయసు పరిమితిని యూజీసీ నిబంధనల మాదిరిగానే 62 సంవత్సరాల నుంచి 65 ఏళ్లకు పెంచాలని కోరుతూ ఏపీ హైకోర్టులో వేసిన రిట్‌లపై విచారణ ఈ నెల 13న జరిగింది. కోర్టు ఎలాంటి తదుపరి ఉత్తర్వులు ఇవ్వకుండానే ఈ నెల మూడో వారానికి వాయిదా వేసినట్టుగా తెలుస్తోంది. ఈ అంశంతో ఉద్యాన వర్సిటీ వీసీ నియామక వ్యవహారం ముడిపడి ఉండటంతో, వర్సిటీలోని వీసీ కుర్చీ 45 రోజులుగా ఖాళీగానే ఉంది.

ఆదర్శనీయులు బీవీ రాజు

భీమవరం: పట్టణంలోని విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపక చైర్మన్ బీవీ రాజు జయంతి సందర్భంగా బుధవారం భీమవరం పరిసర ప్రాంతాల్లో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా బీవీ రాజు పాఠశాలలోని ప్రతిభ కనబర్చిన 20 మంది విద్యార్థులకు రూ.83 వేలు స్కాలర్‌షిప్‌లు అందించారు. భీమవరం, శృంగవృక్షంలోని లెప్రసీ రోగులకు బియ్యం, పండ్లు పంపిణీ చేశారు. అలాగే పట్టణంలోని సెంట్‌మేరీస్ లెప్రసీ సెంటర్‌లోని ఎయిడ్స్, టీబీ, లెప్రసీ రోగులకు రూ.60 వేల విలువైన మందులతోపాటు 250 మందికి బియ్యం, పండ్లు పంపిణీ చేశారు. విష్ణు విద్యాసంస్థల విద్యార్థులు ఏఎస్ఎన్ రాజు చారిటబుల్ ట్రస్ట్ బ్లడ్‌బ్యాంక్‌లో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు.


విష్ణు కళాశాల విద్యార్థుల రక్తదాన శిబిరం

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ జిల్లా జట్ల ఎంపిక


అండర్ 19 బాలికల జిల్లా జట్టు


అండర్ 19 బాలుర జిల్లా జట్టు

పెదవేగి: ఎస్‌జీఎఫ్ అండర్ 19 ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాల, బాలికల జట్ల ఎంపికలు పెదవేగి మండలం లక్ష్మీపురం పంచాయతీ ఎంఆర్‌సీ కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులంలో ఉత్సాహంగా జరిగాయని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె జయరాజు తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించి, బాలికల జిల్లా జట్టును, బాలుర జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఈ పోటీల్లో ప్రిన్సిపాల్ ఏవీ శివప్రసాద్, జిల్లా కార్యదర్శి కె జయరాజు, పీడీలు ఆండాలు, రాజా, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు

భీమవరం: విద్యార్థుల్లో సైన్స్ పట్ల అవగాహన, ప్రశ్నించే తత్వం, శాస్త్రీయ దృక్పథాన్ని చెకుముకి సైన్స్ సంబరాలు పెంపొందిస్తాయని జిల్లా విద్యా శాఖాధికారి ఇ నారాయణ అన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాలు పోస్టర్‌ను బుధవారం డీఈవో కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువమంది విద్యార్థులు సైన్స్ సంబరాల్లో పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. చెకుముకి జిల్లా కన్వీనర్ రేపాక వెంకన్నబాబు మాట్లాడుతూ ఈనెల 18వ తేదీన పాఠశాల, నవంబర్ 1న మండల, నవంబర్ 23న జిల్లా స్థాయిలోను డిసెంబర్ 12,13,14 తేదీల్లో రాష్ట్రస్థాయిలోనూ చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్ సత్యనారాయణ, డీసీఈబీ సెక్రటరీ జీవీవీ శ్రీనివాస్, కుమారస్వామి, జనవిజ్ఞానవేదిక గౌరవ సలహాదారు ప్రత్తి వీరాస్వామి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జామాను రామలక్ష్మణరావు, మల్లుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


సైన్స్ సంబరాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో నారాయణ